క్లుప్తంగా

డ్రెయిన్‌కు తూముల ఏర్పాటు



మండవల్లి: మండవల్లిలోని కైకలూరు వీధిలోని డ్రెయిన్లకు సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో గురువారం తూములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. డ్రెయినేజీ నీరు సక్రమంగా వెళ్లడానికి తూములు ఏర్పాటు చేశామన్నారు. తూముల వల్ల నీరు సక్రమంగా బోదెలోకి వెళ్లి డ్రెయిన్‌లో కలుస్తాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, వార్డు సభ్యుడు పసుపులేటి నాంచారయ్య, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యం

ముదినేపల్లిరూరల్: పంచాయతీ పరిధిలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. స్థానిక రజకుల చెరువు వద్ద చెత్తకుప్పల తొలగింపును గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

వైభవంగా సుదర్శన యాగం



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృశింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీలక్ష్మీనృశింహస్వామి సుదర్శన యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ యాజ్ఞికుడు ఆసూరి రంగనాథచార్యులు ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాల నడుమ యాగాన్ని జరిపారు. ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అదేవిధంగా ఇదే గ్రామంలోని శ్రీఅమృతేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కంతేటి వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పామర్రులో తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు



పామర్రు: తూనికలు కొలతల అధికారులు పామర్రులోని పలు కూరగాయల దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. గ్రామంలోని రైతుబజారు, కూరగాయల మార్కెట్, ప్రైవేటు దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్ తదితరాలలోని కాటాలను పరిశీలించారు. కాటాలకు కొత్త సీళ్లను వేశారు. సమీప గ్రామాల్లోని దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో తూనికలు కొలతల శాఖకు చెందిన నందిగామ, గుడివాడ, విజయవాడ, అసిస్టెంట్ కలెక్టర్లు ఎన్‌యూ భాను ప్రసాద్, టి.రాజేంద్ర ప్రసాద్, బి.కుమారి, మచిలీపట్నం, గుడివాడ, నందిగామ ఇన్‌స్పెక్టర్లు ఎన్‌వీఎస్ ఈశ్వర్‌రావు, వి.ప్రకాశ్‌రావు, షేక్ సలీమన్ పాల్గొన్నారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు

పెడన: అనధికార లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని, ఎవరైనా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కు వ్యతిరేకంగా లే అవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని ముడా ప్లానింగ్ అధికారి శాంతిలత అన్నారు. ఆమె మండలంలోని బల్లిపర్రు గ్రామ సమీపంలో గురువారం ఉదయం లేఅవుట్‌ను పరిశీలించారు. పోలీస్ బందోబస్తుతో ఆమె లేఅవుట్‌ను సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ముడా జూనియర్ ప్లానింగ్ అధికారి సుగుణకుమారి, పంచాయతీ కార్యదర్శి బొల్లా నాగరాజు, వీఆర్వోగణేష్, ఎస్‌ఐ–2 సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రామలింగేశ్వరుడి ఆదాయం రూ.3.57 లక్షలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం, ఆలయ ఉపాలయాల్లో గురువారం హుండీల్లోని కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని అన్ని హుండీల్లో కానుకలు లెక్కించగా రూ. 3,57,678 ఆదాయం వచ్చినట్లు ఈఓ బి.సుబ్బారెడ్డి తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డీఎన్నార్
- వెలంపేటలో గుడ్ మార్నింగ్ కైకలూరు



వెలంపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించామని, అందుకే తలెత్తుకుని ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం గురువారానికి 19వ రోజుకు చేరింది. వెలంపేటలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే డీఎన్నార్ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం వెలంపేటలో వర్షం పడితే పూర్తిగా నీటిలో మునిగి ఉండేదన్నారు. అటువంటిది సీసీ రోడ్లు నిర్మాణం, డ్రెయిన్లకు మరమ్మతులు చేయించామన్నారు. వెలంపేటకు చెందిన అనేక మందికి వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లో ఇంటి స్థలాలను కేటాయించామని చెప్పారు.

విశేష స్పందన

గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతి గడపతోనూ సంక్షేమ కార్యక్రమాలు అందాయనే సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ మూడేడ్ల శశికళ, రాష్ట్ర, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, నాయకులు బూరుబోయిన మోహనరావు, సాన శ్రీనివాసరావు, మహ్మద్ గాలిబ్‌బాబు, సమయం ఆంజనేయులు, దండే రవిప్రకాష్, బిరుదుగడ్డ లాజర్, తులసి పూర్ణ, నిమ్మల శ్రీను, సామిరెడ్డి నారాయణ, పెంటా అనిల్, పోలవరపు శ్రీనివాసరావు, చింతల శ్యామల, గెడ్డం శ్యామలరావు, మడక శ్రీనివాసరావు, రెడ్డి శ్రీను, సుంకర శివ, వేగిరెడ్డి మంగరాజు, గునుపూడి జ్యోతి, బోను ప్రకాష్, అర్నిపల్లి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బొడ్డు చిన్ని హఠాన్మరణం



చిన్ని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మాజీ సర్పంచ్ బొడ్డు సుగుణాకరరావు(చిన్ని)(49) హఠాన్మరణం చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య భవాని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుగుణాకరరావు భౌతికకాయాన్ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. చిన్ని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే డీవై దాస్, బీసీ నాయకుడు వీరంకి గురుమూర్తి, కంకిపాడు జెడ్పీటీసీ బాకీబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక, ఉయ్యూరు సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వీరపనేని శివరామ్ తదితరులు సుగుణాకరరావు మృతదేహానికి నివాళులర్పించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

గుడివాడటౌన్: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభను చాటారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ గురువారం తెలిపారు. తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో వి.హేమ సాయిసిద్ధార్థ 2వ ర్యాంక్, వి.యోజిత్ రెడ్డి 3వ ర్యాంక్, డి.తేజిత్ నాయుడు 4వ ర్యాంక్, బి.కీర్తన్ రెడ్డి 9వ ర్యాంక్, వైవీ.కార్తిక్ 10వ ర్యాంక్, ఎస్‌కే సాచిత్ రెహ్మాన్ 11వ ర్యాంక్, ఇ.వైష్ణవ్‌రెడ్డి 12వ ర్యాంక్ సాధించారన్నారు. ఇవి కాక రాష్ట్ర స్థాయిలో 100 లోపు ర్యాంకులు సాధించిన వారు 48 మంది ఉన్నారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్స్ సత్యరామ్, జ్యోతి, జబ్రీనాలు అభినందించారు.


ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

బందరు డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్‌సుభాన్

కోనేరుసెంటర్: ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని బందరు డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుభాన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాకు విచ్చేసిన కేంద్ర సాయుధ బలగాలతో బందరు సబ్‌డివిజన్ పోలీసులు మచిలీపట్నంలో గురువారం కవాతు నిర్వహించారు. హైనీ హైస్కూలు వద్ద నుంచి ప్రారంభమైన కవాతు లక్ష్మీటాకీస్‌సెంటర్, జిల్లాకోర్టుసెంటర్, బస్టాండ్‌సెంటర్, కోనేరుసెంటర్‌ల మీదుగా కోటావారితుళ్లసెంటర్, బుట్టాయిపేట, రామానాయుడుపేట, పరాసుపేట, చిలకలపూడి, జెడ్పీ సెంటర్ మీదుగా తిరిగి స్కూల్ వద్దకు చేరింది. ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని డీఎస్పీ చెప్పారు. అల్లర్లకు ఎవరైనా యత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ సీఐ జేవీ రమణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో డయాలసిస్ సేవలు

- ఐదు నెలల క్రితం డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- ఇప్పటి వరకూ 579 సార్లు డయాలసిస్ సేవలు
- 23 మంది పేషెంట్లకు సేవలు
- తగ్గిన దూరా భారం



అవనిగడ్డ డయాలసిస్ సెంటర్

అవనిగడ్డ: 'నాగాయలంక మండలం మర్రిపాలెంకు చెందిన విమల గత మూడేళ్ల నుంచి గుంటూరు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ఇక్కడ నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు.' ఇలా దివిసీమకు చెందిన 23 మంది పేషెంట్లు ఇబ్బందులు పడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే సమస్య తొలగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు ఐదు నెలల క్రితం అవనిగడ్డలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ఈ ప్రాంత కిడ్నీ రోగులకు విశేష సేవలు అందిస్తోంది.


హామీ మేరకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విజ్ఞప్తిపై డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ, అపోలో సహకారంతో రూ.14.50 లక్షలతో గత ఏడాది నవంబర్ 2వ తేదీన అవనిగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు.

తొలగిన ఇబ్బందులు


నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 23 మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. వీరంతా గతంలో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, హైదరాబాద్ వెళ్లి డయాలసిస్ సేవలు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ సేవలు తీసుకునేందుకు ఎంతో వ్యయప్రయాసలు పడేవారు. డయాలసిస్ కేంద్రాలకు వెళ్లాలంటే మరొకరి సాయం కావాల్సి వచ్చేది. వెళ్లిన సమయానికి ఏదైనా సమస్య ఎదురైనా, రోగులు ఎక్కువగా ఉన్నా మరో రోజు అక్కడ ఉండాల్సి వచ్చేది. అవనిగడ్డలో డయాలసిస్ కేంద్రంను ఏర్పాటు చేయడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన సెంటర్‌లో మొత్తం ఆరు డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ముగ్గురు టెక్నీషియన్లు ఇక్కడ డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకూ 579 సార్లు డయాలసిస్ సేవలు అందించారు. ప్రారంభించిన నవంబర్ నెలలో 8 సార్లు, డిసెంబర్‌లో 82, జనవరిలో 144, ఫిబ్రవరిలో 201, మార్చిలో ఇప్పటి వరకూ 144 సార్లు రోగులకు డయాలసిస్ సేవలు చేశారు. అవనిగడ్డలో సెంటర్‌ని ఏర్పాటు చేయడంతో దూర ప్రాంతానికి వెళ్లే ఇబ్బందులు తొలగిపోయాయని పలువురు డయాలసిస్ పేషెంట్లు సంతోషం వ్యక్తం చేశారు.

గతంలో వేరేచోటుకు..



మూడు సంవత్సరాల నుంచి డయాలసిస్ తీసుకుంటున్నాను. గతంలో గుంటూరు, విజయవాడకు వెళ్ళి డయాలసిస్ చేయించుకునేవాడిని. అక్కడకు వెళ్ళాలంటే మరొకరి సహాయం కావాల్సి వచ్చేది. అవనిగడ్డలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. –కె.శివశంకర్, మండపాకల

వ్యయ ప్రయాసలు తగ్గాయి



గతంలో మచిలీపట్నం వెళ్లి డయాలసిస్ చేయించుకునేదానిని. అవనిగడ్డలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇక్కడే చేయించుకుంటున్నాను. మాకు దగ్గరగా సెంటర్ ఉండటంతో వ్యయ ప్రయాసలు తగ్గాయి. ఇక్కడ వైద్య సిబ్బంది బాగా చూసుకుంటున్నారు. –కె.నిర్మల, మోపిదేవి

వీరరాఘవమ్మ మృతికి సంతాపం

పామర్రు: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తి వీరరాఘవమ్మ(92) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమెకు ఈనెల 18న గుండెపోటు రావటంతో విజయవాడలోని ఓ వైద్యశాలలో చేర్పించారు. వైద్య సేవలు పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతురాలి దగ్గర బంధువులు ఇతర దేశాల నుంచి రావాల్సి నందున మృతురాలి పార్థివదేహాన్ని మార్చురీలో ఉంచి గురువారం ఉదయం స్వగ్రామమైన పామర్రులోని ఇంటికి తీసుకువచ్చారు. పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ మృతురాలి పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి, మిగిలిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, డి.ఆనంద్‌రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: మండలంలోని ఐలూరులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐలూరు–మేడూరు రోడ్డులోని ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం వేకువజామున దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ పి.విశ్వనాథ్ చెప్పారు. వారి నుంచి రూ. 23,500ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వాహనాల తనిఖీ



ఘంటసాల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదు, బంగారు ఆభరణాలు తరలించకూడదని ఘంటసాల ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఘంటసాలలో గురువారం సాయంత్రం ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్, గ్రామ శివార్లలో వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లకు మరమ్మతులు

కృత్తివెన్ను: స్థానిక 33 కేవీ లైను వైర్లపై కొబ్బరిచెట్టు పడటంతో 5 విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు ఏఈఈ వెంకన్నబాబు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అధికారులు యుద్ధప్రాతిపదికన లైను మరమ్మతులు చేపట్టారు. నూతన స్తంభాలు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన కొత్త విద్యుత్ వైర్లును సైతం వేసి సరఫరాను పునరుద్ధరించారు.

25న అయ్యప్పస్వామి తిరునక్షత్ర పూజలు

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామివారి దేవాలయంలో ఈ నెల 25న స్వామివారి తిరునక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకం, పుష్పార్చన జరుగుతుందని అనంతరం గజవాహనంపై ఉత్సవ మూర్తిని ఊరేగించనున్నట్లు వివరించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన చెత్త ట్రాక్టర్

మచిలీపట్నంటౌన్: నగరంలోని జెడ్పీ సెంటరులో గురువారం నగరపాలకసంస్థకు చెందిన చెత్త ట్రాక్టర్ దుకాణంలోకి దూసుకెళ్లింది. చెత్తను సేకరించి వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా స్విమ్మింగ్‌పూల్ ఎదురుగా ఉన్న షాపుల వైపు దూసుకెళ్లింది. దీన్ని గమనించిన అక్కడి ప్రజలు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. చెత్తను సేకరించి చిలకలపూడి నుంచి డంపింగ్‌యార్డుకు వెళ్తున్న ట్రాక్టర్ స్టీరింగ్ బోల్ట్ ఊడటంతో ఈ ప్రమాదం జరిగిందని కమిషనర్ బాపిరాజు తెలిపారు.

తీరప్రాంత గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

కృత్తివెన్ను: మండల పరిధిలోని సముద్ర తీరానికి అత్యంత చేరువగా ఉండి తాగునీటికి ఇబ్బంది పడుతున్న గ్రామాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టినట్లు ఎంపీడీవో పిచ్చిబాబు తెలిపారు. గురువారం చినపాండ్రాక పంచాయతీలోని రామాపురం, సీతారామపురం, చెరుకుమిల్లి పంచాయతీలోని ఉప్పులూరు, ఇంతేరు పంచాయతీలోని పార్వతీపురం, మాట్లాం గ్రామపంచాయతీ ఈ ఐదు గ్రామాలకు కలెక్టర్ నిధుల నుంచి ట్యాంకర్లు ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి నీటి ఎద్దటి ఉన్న గ్రామాలను గుర్తించి వాటికి కూడా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీదేవి

పామర్రు: త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పామర్రు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిని శ్రీ దేవి సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారులకు, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల నియమావళి పర్యవేక్షక బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, గ్రామాల్లో రాజకీయ పార్టీనేతల ఎన్నికల ప్రచారానికి వినియోగించే లౌడ్ స్పీకర్లు, ప్రచార సమావేశాలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటు, ర్యాలీల నిర్వహణ ప్రచారానికి వినియోగించే వాహనాలు తదితర వాటి వినియోగంచేందుకు తప్పనిసరిగా రిటర్నింట్ అధికారి నుంచి అనుమతులు పొందాలన్నారు. అనుమతులు పొందేందుకు రిటర్నింగ్ కార్యాలయంలో సింగల్ విండో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. సదరు కౌంటర్ నందు అర్జీలను సమర్పించి, అనుమతులు పొందాలని చెప్పారు.

అఖిల భారత బీసీ సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా సుజాత



నియామక పత్రాన్ని అందుకుంటున్న సుజాత

కైకలూరు: అఖిల భారత బీసీ సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా భుజబలపట్నం గ్రామానికి చెందిన ఉచ్చుల సుజాత ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బీసీ సమాఖ్య సమావేశం బుధవారం జరిగింది. అఖిల భారత బీసీ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సత్యవాడ శ్రీనివాసు, జాతీయ లీగల్ సెల్ ప్రెసిడెంట్ డాక్టర్ హనోక్ వర్ధన్, జాతీయ మహిళా సెక్రటరీ గడి ఝాన్సీ, జాతీయ ప్రసార సెక్రటరీ లోగిసు వెంకట బాలకృష్ణ హాజరయ్యారు. జాతీయ అధ్యక్షుడు నుంచి సుజాత నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల ఐక్యత కోసం కృషి చేస్తానన్నారు. సుజాత నియామకంపై పలువురు బీసీ సంఘ నేతలు అభినందనలు తెలిపారు.

ఘనంగా వరల్డ్ డౌన్ సిన్‌డ్రోమ్ సెలబ్రేషన్ డే



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, కాశీనాథుని నాగేశ్వరరావు

ఎలకుర్రు(పామర్రు): ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు కేడీబీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు పి.సురేష్‌చంద్రారెడ్డి అన్నారు. మండల పరిధి ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య(కేడీబీ) ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు గల మానసిక దివ్యాంగుల పాఠశాలలో గురువారం వరల్డ్ డౌన్ సిన్‌డ్రోమ్ సెలబ్రేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అవసరమైన చేయూతను తల్లిదండ్రులు, సమాజం కల్పిస్తే వారు స్వతంత్ర్యంగా జీవించగలరన్నారు. వారి జీవితాలను వారే తీర్చిదిద్దుకునే విధంగా కృషి చేయాలని చెప్పారు. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన నేషనల్ ట్రస్ట్, కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో న్యూనత, భయం లేకుండా పిల్లలను ప్రత్యేక పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. డౌన్ సిన్‌డ్రోమ్ ఉన్న పిల్లలకు మాట రావడంలో లోపం ఉంటుందన్నారు. అటువంటి వారిని వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తే నిష్ణాతులుగా మారే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం దివ్యాంగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కాశీనాథుని నాగేశ్వరరావు, కేడీబీ ట్రస్ట్ డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకురాలు వై.ప్రసన్నకుమారి, కేడీబీ ట్రస్ట్ ప్రిన్సిపాల్ డి.వసుంధర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్టీ సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేం చేసి ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్టీ పాదిలి సత్యనారాయణను సత్యనారాయణపురంలోని ఆయన నివాసంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు గురువారం సత్కరించారు. దేవస్థానం పాలక మండలిలో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సామాజిక సమతుల్యం పాటిస్తోందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన భీమేశ్వర స్వామి ఆలయం ట్రస్ట్ బోర్డులో ఒక నాయీ బ్రాహ్మణ వ్యక్తి నియామకం కావడం శివపార్వతుల ఆశీస్సులేనన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ నాయకులు డీఆర్‌బీ ప్రసాదు, చుండి బాబి, ద్రోణాదుల రామకృష్ణ, చుండి మధు, చిత్తాబత్తుల సాంబశివరావు, చుండి మహేష్, కుమార్, హరికృష్ణ, విశ్వబ్రాహ్మణ నాయకులు సీహెచ్ సత్యనారాయణ, వాసవీ క్లబ్ జిల్లా సభ్యుడు మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

24న రామేశ్వరస్వామివారి ఆలయంలో ధాన్యాభిషేకం

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలోని శ్రీ కాంచి కామకోటి పీఠస్థ శ్రీబాలా పార్వతి సమేత శ్రీరామేశ్వరస్వామివారి ఆలయంలో 24వ తేదీ ఆదివారం ధాన్యాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నవధాన్యాలు వేదమంత్రాలతో స్వామివారి ఉత్సవ మూర్తులకు ధాన్య సమర్పణ జరుగుతుందని పేర్కొన్నారు. లోకకల్యాణార్థం అభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు.